**చిట్టికథ :**

# వేషం!

-యం. వసంతకుమారి

సమయం రాత్రి ఎనిమిదవుతోంది. మద్రాసు ఎక్స్‌ప్రెస్ బయలుదేరటానికి ఇంకా 15 ని॥లు టైముంది.

నాంపల్లి స్టేషనులో వేసవికాలం రద్దీతో ఆ జన ప్రవాహం సముద్రంలోని అలల్లాగా కదుల్తోంది.

"అమ్మో! ఎంత రద్దీ, నేను మద్రాసు ట్రైన్ అందుకోగలనా!" అంటూ ఆటోలో నుండి ఒక్కసారి గెంతి, డబ్బులిచ్చి పరుగెత్తుకుని వస్తున్నాడో సఫారి సూటు వాలా. వెనుక నుండి "ఒరేయ్, కల్యాణ్ ఆగరా ఒక్క నిముషం" అంటూ పిలుస్తున్నా వినిపించుకో కుండా, ఆ సఫారీ సూటువాలా "అమ్మో చూడనే చూశాడా ఆఫీసు దయ్యం" అనుకుంటూ ఆ జన ప్రవాహంలోకి చొరబడ్డాడు.

అప్పటికే మైకులో మద్రాసు ఎక్స్‌ప్రెస్ 8వ ప్లాట్ ఫారం మీదికి వచ్చింది అంటూ ఇంగ్లీషులో, హిందీ, తెలుగు భాషల్లో అనౌన్సు చేస్తున్నారు.

ఓ చిన్న బ్రీఫ్‌కేసు పట్టుకొని హడావుడిగా ఓవర్ బ్రిడ్జ్ దాటి, 8వ ప్లాట్‌ఫారం చేరుకున్నాడు కల్యాణ్. జనరల్ కంపార్ట్‌మెంటు వెదుక్కొనేటప్పటికి, ట్రైన్ కూతవేయటమూ, కదలటమూ జరిగింది. వెంటనే తన పక్కనే వున్న II క్లాసు కంపార్టుమెంటులోకి దూరి గబుక్కున ఓ సీటులో కూర్చున్నాడు. "అమ్మయ్య! మొత్తం మీద ట్రైన్ మిస్ కాలేదు. ఈ ట్రైన్ కనుక మిస్సయ్యుంటే, తను పడే కష్టాలు ఒక్కసారి గుర్తుకు తెచ్చుకున్నాడు కల్యాణ్.

కల్యాణ్ ఒక బ్యాంకులో ఆఫీసరు. ఈ మధ్యనే ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది. ఆఫీసు పని మీద పదిహేను రోజులు మద్రాసుకు పంపించారు. హైదరాబాదులో భార్య, ఇద్దరాడ పిల్లలు, ముసలి తల్లి వున్నారు. ఆమెకు తానొక్కడే సంతానం. రావల్సిన సమయం కాదు. కాని తల్లికి అనారోగ్యంగా వుందని టెలిగ్రాం ఇవ్వటం వల్ల, మద్రాసు నుండి నిన్న వచ్చి, తిరిగి ఈ రోజు వెళ్లిపోతున్నాడు.

అప్పుడే ఒక ముసలతను మాసిన, చిరిగిన చొక్కా వేసుకుని, ఓ మాసిన సంచి పట్టుకుని హడావుడిగా ఆ కంపార్టుమెంటులోకే ఎక్కి, ఓ మూల ఎవరిదో మూట వుంటే దాని మీద కూర్చున్నాడు, ఒగరుస్తూ.

అప్పటికే కాజీపేట స్టేషను దాటింది. టి.సి. వచ్చాడు. ఒక్కొక్కరిని టికెట్ అడిగి చెక్ చేసి సంతకం చేసి ఇస్తున్నాడు వరుసగా.

నిద్రలోకి జారుకున్న ముసలతని దగ్గరకు వచ్చి, "ఇక్కడెందుకు పడుకున్నారు దొరగారు? రిజర్వేషను కంపార్టుమెంటు" అంటూ గట్టిగా అరిచాడు.

ఒక్కసారి ఉలిక్కిపడిన ఆ ముసలతను, "మా ముసల్దాన్ని హాస్పెటల్‌లో చేర్పించి వచ్చేసరికి, రైలు కదుల్తుందయ్యా, చూసుకోకుండా ఎక్కాను." అన్నాడు భయపడ్తూ.

"ఊఁ. ఊఁ. టికట్ ఏది? ముందు చూపించు, అదన్నా వుందా? దానికో కథ చెప్తావా?"

అప్పటికే, ముసలతను, జేబులో టికెట్ వెతుకుతున్నాడు. కాని అక్కడ లేకపోయేసరికి, కంగారుగా సంచిలో చెయ్యిపెట్టి, వస్తువులన్నింటినీ చిందరవందర చేస్తూ వెదుకుతున్నాడు.



"ఊ. ఎంత సేపయ్యా వెదకటం? అసలు కొంటే గదా టికెట్ ఉండటానికి. ఈ మధ్య ఇలాంటి న్యూసెన్స్ కేసులతో చచ్చిపోతున్నాం." అంటూ టి.సి. రెచ్చిపోతున్నాడు.

"లేదయ్యా, టికెట్ కొన్నానయ్యా, జేబు చిరిగి జారి పోయుంటుంది టికెట్". ఇంకా ఆశతో సంచిలోని వస్తువులన్నీ కిందకుమ్మరించి, చూస్తున్నాడు. బెదురు చూపులతో, "కనికరించండయ్యా. నా కొడుకు, కాలేజీలో.... "అంటూ చెప్పబోయేంతలో టి.సి. ఒక్క తన్ను తన్ని, "రాస్కెల్. కథలు చెప్పటం మొదలు పెట్తున్నాడు. పద పోలీస్ స్టేషన్‌కి. కొడుకు..... కాలేజీలో సీటు రైలు టికెట్ కొనటానికి గతి లేదు. మా ప్రాణాలు తీయటానికి వస్తారు, ఇలాంటి వాళ్లు. ఆ పోలీస్ వాళ్లకు చెప్పుకుందువు గాని, నీ కథలు." అంటూ, ఎన్నాళ్ల నుండో కసి పెంచుకుని పెంచుకుని లావాలాగా పొంగి పొంగి బద్దలైనట్టుగా కేకలు.... అరుపులు.

కల్యాణ్‌కు ముళ్ల మీద కూర్చున్నట్టుగా ఉంది. చెమట్లు పట్టేస్తున్నాయి. హార్ట్ అటాక్ వచ్చినంత పనవుతోంది. గుండెదడగా వుంది. వాడిని తిడుతూంటే తన మీద జెర్రులు, తేళ్లు పాకినట్టుంది.

ఆ ముసలి ప్రాణం ఎక్కడ పోతుందో ననిపిస్తోంది. వాణ్ణి తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తున్నాడు టి.సి. ఇంతలో డోర్నకల్ స్టేషన్ వచ్చింది. వాణ్ణీడ్చుకుని పోవటానికి సిద్ధమౌతున్నాడు టి.సి.

ఆ ముసలతను "సార్, సార్ నా కొడుకు జీవితం నాశనం చేయకండి. రేపే ఆఖరు తేది. గవర్నమెంటు కాలేజీలో రిజర్వేషను కోటాలో వాడికి సీటొచ్చింది. ఫీజు కట్టినం సార్. నేను వెళ్లి ఈ కాగితాలు (సర్టిఫికెట్సు) ఇయ్యకపోతే వాడ్ని చేర్చుకోరు సార్." అంటూ సంచిలోని చిల్లరంతా కలిపి ఎంతుందో లెక్క చూస్తున్నాడు ఇవ్వటానికి. కానీ అంతా కలిపి 65 రూ॥లు వుంది. వాడి టికెట్ ఖరీదు 75. రూ॥లు "ఫైన్‌కి ఇంకా కావాలి." స్వగతంలో అనుకున్నా.

ఆఖరి ప్రయత్నంగా, రెండు కాళ్లు పట్టుకొని "బాంచెను, నీ కాళ్లు మొక్కుతా దొరా, కనికరించండయ్యా" అంటూండగానే టి.సి. ఒక్క తన్ను తన్ని, వాడి మాటల్నేమి లెక్కచేయకుండా, వాడి చేయి పట్టుకొని, లాక్కొని బరా బరా ఈడ్చుకుని పోయాడు.

"పోలీస్ చేతుల్లో పడ్డాడు. ఇక వాడ్ని, దేవుడుకూడా రక్షించలేడు." కల్యాణ్ నోరెండిపోతోందని మంచి నీళ్లకోసం కిందికి దిగి ఆ భాగోతాన్ని చూస్తూ అనుకున్నాడు.

ఇంతకూ తన గతేమవుతుందో అనుకుని నిబ్బరంగా. ఆ టి.సి. వస్తున్న వైపే తాను నడిచి, ఆ మాట ఈ మాటా కలిపాడు. తను ఒక బ్యాంకులో పెద్ద ఆఫీసరనీ, ఈ మధ్యనే ఆఫీసులో అతి ముఖ్యమైన పని మీద మద్రాసు వెళ్లినట్లు, తనకు ఫలాన బ్యాంకులో ఎంతో పలుకుబడి వున్నట్లు, తను లేకపోతే ఏ పనీ జరగనట్లు అన్నీ ఏకరువు పెట్టాడు. తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు ఆ టి.సి. కి. తన తల్లికి హార్ట్ అటాక్ వస్తే హైద్రాబాదు వచ్చి, మళ్లీ వెళ్తున్నట్లు చెప్పాడు. ఫ్లైట్ దొరక్కపోవడంవల్ల చివరి క్షణంలో రైల్లో వెళ్లవలసి వచ్చిందనీ అందువల్ల టికెట్ కొనలేకపోయాననీ. ఎంతో సిగ్గుగా వుందనీ చెప్పాడు.

"దానిదేముంది సార్, ఎప్పుడూ ఫ్లైట్‌లో తిరిగే మీకేంటి సార్. 195 రూ॥లు కట్టండి సార్. దట్సాల్" అంటూ చేయి చేయి కలిపాడా టి.సి.

"థాంక్యుసార్." అంటూ వెంటనే కంపార్టుమెంటులో ఎక్కి కూర్చున్నాడు కళ్యాణ్ 'బ్రతుకు జీవుడా' అనుకుంటూ. ❑